ఆకలేస్తే ఆకలని అడుగుతాం. కడుపునిండే ప్రయత్నం చేస్తాం! కాని వయస్సుతోపాటు పెరిగిన కోర్కె తీరాలంటే దానికి స్త్రీ అవసరం. అలాగని విధం చెడితే ముందు ఇల్లు గుల్ల ఆ తర్వాత వళ్ళు గుల్ల. అందుకనే పెళ్ళి అనే వ్యవస్థను పెద్దలు అన్ని కులాలకూ, మతాలకూ, దేశాలకూ ఏర్పాటు చేశారు. ఆ వ్యవస్థకి ఓ ప్రత్యేకతని, పవిత్రతని ఆపాదించారు.

వయసులో వున్న ఆరోగ్యవంతమైన, అందమైన అమ్మడి పిన్న నవ్వుగాని, చిరునవ్వుగాని, అలతి నవ్వుగాని, మందస్మిత వదనారవిందాన్నిగాని విన్నా కన్నా రాకేష్‌కి నరాలు జివ్వున లాగడం మొదలవుతుంది. కారణం పెరిగే వయసు.

రాకేష్ వాళ్ళ ప్రక్కింట్లోని పద్మజ వయసులోవున్న పందొమ్మిదేళ్ళ పిల్ల. వయసుకు తగ్గా వళ్ళూ, పొడుగూ, అందం ఆమెవి. రాకేష్ వయసు ఫిజిక్స్‌లో డాక్టరేట్ పొందేటప్పటికే ముప్పై వచ్చేశాయి. అయినా అవివాహితుడే ఇంకా అతగాడు..దసరా సెలవులకో, సంక్రాంతి సెలవులకో, వేసవి సెలవులకో ఇంటికొచ్చి ఒకవారం గడుపుతాడు. మిగిలిన రోజులన్నీ అతడు పట్నంలోగల రెసిడెన్షియల్ కాలేజీలోనే గడిపేస్తాడు. దానికి తానే నాధుడు (ప్రిన్స్‌పాల్) కాకపోయినా వెన్నెముకగా అందరి మన్ననలూ పొందగలిగాడు. ఫిజిక్సు సబ్జెక్టు అతని ఊపిరి. అలాగని అతనిలో భావుకత్వం గాని, కలలుగనే కళ్ళు గాని నిద్రాణమై లేవు. అన్నీవున్నా కొందరు తమ అవసరాల్ని తీర్చుకోలేరు. అభిమానాన్ని, అంతస్తును వదులుకోలేరు. అదొకరకమైన కాంప్లెక్స్ కావచ్చు.

దసరా సెలవులకు ఇంటికొచ్చినప్పుడు పద్మజను చూసి ''బాగున్నావా'' అన్నాడు.

ఆమె బోలెడంత సిగ్గుపడిపోయింది.

పద్మజ తల్లి ''అదేవిటే! అతనంత ఇదిగా పలకరిస్తుంటే మాట వరసకైనా మాట్లాడవు. కనీసం 'హలో అంకుల్' అనైనా అనకూడదా! నువ్వు మాట్లాడితే రత్నాలు రాలిపోవు'' అంది. ఆమె మాటలు విని రాకేష్ ముఖం నల్లబడిపోయింది. లేకపోతే తనకు వరుసకు అత్త, అప్పుడే తనని అంకుల్ అనమని పద్మజతో చెబుతుందా! ఇంకా నయం. మావయ్యగారూ అని పిలవమన్లేదు అనుకుని గిరుక్కున వెనుదిరిగాడు.

కాని పద్మజని చూడాలనే కోరిక అతనిని ఇంటికి వెళ్ళనివ్వలేదు. అభిమానం మాత్రం ఇంటికి నడిపించింది.

★★★

జానకిరామయ్య కాలుస్తున్న చుట్ట రాకేష్‌ని చూసి దూరంగా విసిరేసి దగ్గరగా వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. రాకేష్ వెంటనే ''చూడు జానకిరామయ్యా! నిన్ను వయస్సునుబట్టి గౌరవించాలి. పొగతాగ కూడదని నీకెన్ని సార్లు చెప్పాను'' అంటూ నిలదీశాడు.

''బాబ్బాబూ! అలవాటు పడ్డప్రాణం. అయినా ముప్పై ఏళ్ళనుంచున్న అలవాటు ఒక్కసారెట్టా పోతుంది. అదెలా మానుకున్నానా! ఇదన్నా లేకపోతే ఎట్టా! బాబూ మాకు పప్పన్నం ఎప్పుడెడతారు?'' అని ఎంతో ఆసక్తిగా అడిగాడు.

''నువ్వు ముందరి కాళ్ళకు బంధం వెయ్యడంలో గట్టివాడివి. నా పెళ్ళిమాట అటుంచి, నీక్కావలిస్తే డబ్బులిస్తా మంచి మిలట్రీ హోటల్‌కెళ్ళి సుష్టుగా తిన్రా'' అన్నాడు.

''అది కాదు బాబూ! ఏ వయసులో సరదా ఆ వయసులో తీరుసుకోవాలి. మీకు తెల్డుగానీ, తలమీద జుట్టు మరీ నాలాగ బట్టతల కాకపోయినా ఇంకా రెండేళ్ళుంటే మీరింక ముసిలోడి కిందే లెక్క! మరోలా అనుకోకండి! అదిగో పిన్సిపాల్‌గారు పిలుత్తున్నట్టున్నారు. కాలింగ్ బెల్ మోగింది.'' అంటూ వెళ్ళిపోయాడు.

ఒక్కసారి తల తడుముకుంటే ఇంచుమించు బట్టతల కాబోతున్నట్టుగానే అనిపించింది. అసలు అనుమానం రాకూడదు. వస్తే అది పెనుభూతమై పీడిస్తుంది. తన గదిలోకి తిరిగి వచ్చాక పెళ్ళి గురించిన ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోసాగింది రాకేష్‌కి. తన తోటి మిత్రులంతా పెళ్ళిళ్ళు చేసుకుని ఒకరిద్దరు పిల్లాపాపలతో ఎంతో ఆనందంగా జీవితాన్ని గడుపుతున్నారు. తాను అసలు ఎందుకని ఇన్నాళ్ళూ పెళ్ళి చేసుకోకుండా గడిపినట్లు? ఇంక లాభం లేదు.

ఏమైనా సరే పద్మజని పెళ్ళి చేసుకుందామనే నిశ్చయానికొచ్చాడు. ఆమె అభిప్రాయం ఏవిటో కనుక్కు నుండాల్సింది అనుకున్నాడు.

ఉండబట్టలేక ప్రిన్స్‌పాల్‌తో ఆ ముక్క చెప్పాడు. దానికి అతను గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ 'బెస్ట్ ఆఫ్ లక్' చెప్పాడు రాకేష్‌కి.

మాలతి -కొడుకు పెళ్ళాడతానంటూ వ్రాసిన ఉత్తరాన్ని చూసి పొంగిపోయింది. భర్త కోటేశ్వర్రావు దగ్గరకెళ్ళి ఆ ఉత్తరాన్ని అతనికిచ్చింది. ఇన్నాళ్ళకు వీడు పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించాడా! జీవితంలో విలువైన సమయం చాలా పాడుజేసుకున్నాడు. కొడుకు పెళ్ళి ప్రయత్నం గురించే ఎక్కడికో ప్రయాణమౌతున్న అతనికి ఆ ఉత్తరం చెవుల్లో 'బాలు' పాడిన శంకరాభరణం చిత్రంలోని పాటలా అనిపించింది.

మాలతి భర్తకి టీ తీసుకొచ్చి ఇస్తూ ''మీరేం పిల్లను ప్రత్యేకంగా పనిగట్టుకుని వెదకక్కర్లేదు. ప్రక్కింటి పార్వతీ శంగారమ్మాయి అంటే అబ్బాయి ఇష్టపడుతున్నట్లు రాశాడుగా! అందుకని ముందు ఆయనతో మాట్లాడండి'' అంది.

కోటేశ్వరరావు ఫోన్ రింగ్ చేసి పద్మజ తండ్రి సుందరరావుతో విషయం డైరెక్టుగా చెప్పేశాడు. ముందుగా అతను ఎంతో ఆనందించాడు. అయినా మా ఆవిడకీ, అమ్మాయికీ చెప్పి ఏ విషయం తిరిగి మీకు ఫోన్ చేస్తానని వినయంగా చెప్పి ఫోన్ పెట్టేశాడు.

తండ్రి అడిగితే పద్మజ అతనిని పెళ్ళి చేసుకోవడం ఇష్టమేనన్నట్లు తలాడించింది. పద్మజ తల్లి చంద్రావతి భర్త దగ్గరకొస్తూనే ''మీకేమైనా మతిపోయిందా! ఆ

**పెళ్లయిన ఏడాదికే ఒక బిడ్డకి తండ్రి అయ్యాడు రాకేష్. అంతంతమాత్రంగా వున్న అతని జుట్టు మరింత పల్చబడిపోసాగింది. అది చూసి పద్మజ ఎంతో దిగులుపడసాగింది. విసుగొచ్చి నూనె రాయడం మానేశాడు రాకేష్. మూతిమీద మీసం మొలవాల్సిన చోట వెంట్రుకలు మొలకెత్తడం మానేస్తే రాకేష్ ఎంతో సంబరపడి అమ్మయ్య రోజుగియ్యాల్సిన పీడ పోయిందనుకున్నాడు.**

# కుర్తాళం గుండు

-డా.మంతెన సూర్యనారాయణరాజు

అబ్బాయి వయసెక్కడ? మన అమ్మాయి వయసెక్కడ? పది పన్నెండు సంవత్సరాల అంతరం ఉంటుంది'' అంటూ భర్తమీద విరుచుకు పడింది.

''బోలెడంత ఆస్తే! పేరుకు పేరు. మంచి ఉద్యోగం. బ్యాంకు బేలన్స్. నేనింతకన్నా మంచి సంబంధం ఎక్కణ్ణుంచైనా తేగలనా?'' అన్నాడు కోటేశ్వరరావు.

ఆ రాత్రి పద్మజ తల్లి ఇంట్లో వంటా వార్పూ ప్రయత్నం లేకుండా అందర్నీ ఆలోచన్ల సముద్రంలో పడేసింది. ఎడముఖం పెడముఖంగా అంతా ముక్తసరి మాటలతో గడిపారు. తెల్లవారిగట్ల పాల పేకెట్ చించి తనే కాఫీ కాచుకుంటున్న తండ్రి దగ్గర కొచ్చి పద్మజ, ''నాన్నా! నేను కాఫీ పెడతాను. మీరు తప్పుకోండి'' అని తనే కాఫీ పెట్టి తండ్రికి, తల్లికి చెరో కప్పూ ఇచ్చింది. తనూ ఓ కప్పులో పోసుకుంది.

చంద్రావతి ఉబ్బిన ముఖంతో కన్నీళ్ళు వత్తుకుని ''ఏవండీ! మీకంత బాగుంటుందని తోస్తే నాకేం అభ్యంతరం లేదు. కాకపోతే..!'' అంటూ అర్థోక్తిగా ఆగిపోయింది.

''నీ అనుమానం పెద్ద లెక్కలోది కాదు చంద్రా! ఇప్పుడు నేనింతకన్నా మంచి సంబంధం తేవాలంటే ఎన్ని చెప్పుల జతలు అరగాలి? పైగా వాళ్ళడిగే కట్నాలకి తూగగలమో లేదో ఆలోచించుకోవాలి. నిజంగా మన అమ్మాయి పద్మజ అన్ని విధాలా అదృష్టవంతురాలు. దానంతట అదే వెదుక్కుంటూ వచ్చిన సంబంధమిది. కాదని కాలదన్నుకుంటే మూర్ఖత్వమే అవుతుంది'' అన్నాడు కోటేశ్వరరావు.



★★★


పెళ్లయిన ఏడాదికే ఒక బిడ్డకి తండ్రి అయ్యాడు రాకేష్. అంతంతమాత్రంగా వున్న అతని జుట్టు మరింత పల్చబడిపోసాగింది. అది చూసి పద్మజ ఎంతో దిగులుపడసాగింది.


''ఏవండీ! ఎగ్‌షాంపూ వాడండి'' అని కొన్నాళ్ళూ, ఆయుర్వేదిక్ తైలాలు, హోమియోపతీ హెయిర్ ఆయిల్సు కొన్నాళ్ళు వాడించింది. అవి మరింత చెడ్డ ఫలితాలిస్తే తానింక విసుగొచ్చి నూనే రాయడం మానేశాడు రాకేష్. మూతిమీద మీసం మొలవాల్సిన చోట వెంట్రుకలు మొలకెత్తడం మానేస్తే రాకేష్ ఎంతో సంబరపడి అమ్మయ్య రోజుగియ్యాల్సిన పీడ పోయిందనుకున్నాడు. పద్మజకి భర్త మీసం పెంచితే చూడాలనే కోరిక ఎంతగానో ఉండేది. కాని అది తన చేతుల్లో లేదు. అతని వంటినారాసి పెట్టిలేదు. తల దురద పెడుతుంటే ఎంతో నైస్‌గా ఎవరూ చూడకుండా లైట్‌గా బరికేవాడు.

కాలేజీ బైపీ స్టూడెంట్స్‌తో బాటు ఒక సారి 'బైలాజికల్ టూర్' ఏర్పాటు చేశాడు ప్రిన్సిపాల్. పిల్లలను దగ్గరుండి తీస్కెళ్ళడం, అన్నీ చూపించడం, ఆహార విహారాల్లో అన్నింట్లో తనే దగ్గర్నుండి చూసుకొమ్మని రాకేష్ మీద ఆ భారం అంతా వేశాడు ప్రిన్సిపాల్. భార్యామణి పద్మజతో వారం రోజులు దక్షిణాదికెళ్తున్నాం అని చెప్పాడు. ఆమె నేనూ మీకూడా వస్తానంటూ మారాం చేసింది. కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులతో ఎడ్జెస్ట్ అవుతానంటే రమ్మన్నాడు. ఆమె దానికి అంగీకరించలేదు. పద్మజ, భర్తకు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండని ఆదేశించింది. అదీగాక రెండు రకాల పచ్చళ్ళు సీసాల్లో పెట్టిస్తూ, హాట్‌వాటర్ తాగమనీ సలహా ఇచ్చింది.

అన్ని చోట్లూ తిరుగుతూంటే ఆహ్లాదకరంగా ఉంది. ఆఖరి రోజు మజిలీ కుర్తాళం. అక్కడ వాటర్ ఫాల్స్ చూడముచ్చటగా ఉంటుందని చాలామంది చెప్పారు తనకి. పిల్లలంతా ఎప్పుడక్కడ స్నానం చేద్దామా అంటూ ఉవ్విళ్ళూరిపోయారు. గురువుగార్ని తొందరపెట్టారు.

కుర్తాళంలోవున్న మౌనస్వామి ఆశ్రమం(పీఠం), దేవాలయాలు అన్నీ చూసుకుంటూ అంతా వాటర్ ఫాల్స్ దగ్గరకు చేరుకున్నారు. వాతావరణం వర్షం వచ్చేటట్లుగా మారింది. ఉండుండి కారు మబ్బులు కమ్ముకొచ్చాయి. మెరుపులూ వాటితో బాటు ఉరుములూ పుట్టుకొస్తున్నాయి. పట్టువదలని కుర్రకారు అంతా డ్రాయర్లతో




కొందరు, టవల్స్‌తో కొందరూ స్నానానికి ఉపక్రమించారు. విద్యార్థినులు దూరంగా మరోచోట కొందరు స్నానాలు చేస్తున్నారు.

రాకేష్ చేద్దామా-మానేద్దామా అనే సందిగ్ధంలో పడ్డాడు. ఇంత దాకా వచ్చి స్నానం చెయ్యకుండా వెళ్తే ఎలాగండి. వంటికి నూనె మర్దనా చేయించుకోండి. ఆ తర్వాత అరగంట కనీసం స్నానం చేస్తే మీ బుర్రంది చూశారూ అది పాదరసంలా పనిచేస్తుందని సాటి ఆంధ్రా మిత్రుడు రాకేష్‌కి హితబోధ చేశాడు. వెంటనే పది నోటిచ్చి వళ్ళంతా నూనె రాయించుకున్నాడు. నిక్కర్ వేసుకుని నూనె ఇంకగానే స్నానం ప్రారంభించాడు. అరగంట తలారా స్నానం చేశాడు. బుర్రలో నాడులన్నీ చైతన్యవంతంగా పనిచేయడం ప్రారంభించాయి. ఎంతో ఫ్రెష్‌గా హాయిగా ఉంది రాకేష్‌కి. ప్రక్క నున్న స్టూడెంట్ టవల్‌తో తల తుడుచుకుంటుంటే ''టైమెంత!'' అని అడిగాడు. ఆ కుర్రాడు దూరంగా వున్న షర్టు లోంచి వాచ్ తీసి చూస్తూ ''సార్! ఐదు గంటలయ్యింది'' అన్నాడు.

''ఇంక సరిపెడదాం'' అని స్నానం మానేసి బైటికొచ్చాడు. టర్కీ టవల్‌తో తల తుడుచుకుంటూండగా ఉన్న నాలుగు పుంజీల వెంట్రుకలూ చేతిలో కొచ్చేశాయి. నున్నగా గుండు మిగిలింది. సిగ్గుపడిపోయాడు. బిడియంతో చుట్టుకుపోసాగాడు. ఎవరూ ఆ విషయం గమనించకుండానే కూడా ఫేన్సీగా తెచ్చుకున్న కేప్ తగిలించుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు స్టూడెంట్స్‌తో.

★★★

టూర్ ముగించుకొచ్చిన భర్త రాకేష్‌తో పద్మజ ఎంతో ప్రేమ వాత్సల్యాలతో మాట్లాడింది. భోజనాలయ్యాకా తాంబూలం వేసుకుంటుండగా అనుమానంతో భర్తను ''ఏవిటండీ! నాకు తెలీకడుగుతాను. వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను మీవాలకం, భయం భయంగా అదోలా చూస్తారు. ఎంతసేపని ఆ టోపీనలాగే పెట్టుకుంటారు. ఇంక తీసి ప్రక్కన పెడ్డరూ!'' అంది. ఆమె మాట పూర్తి కాకుండానే రాకేష్ నెత్తిమీద టోపీ తీశాడు.

''అదేవిటీ?! అటు నుంచి అలాగే తిరపతెళ్ళి గుండు కొట్టించుకు నొచ్చారా?'' అంటూ ఆశ్చర్యపోతూ అనుమానంగా అడిగింది.

''నా బొంద. అంతటి అదృష్టం కూడానా! తిరపతీ వెళ్ళలేదు. అయ్యప్పకీ వెళ్ళలేదు. ఇది కుర్తాళం వాటర్ ఫాల్స్ క్రింద స్నానం చేస్తే ఏర్పడ్డ గుండు. అర్థమైందా!'' అన్నాడు బిక్కచచ్చిపోతున్నట్టు. ఏడ్పి ముఖం కడుక్కున్నట్టు.

''హయ్యో! ఖర్మ. దెసకొల్దీ దొరికాడు బిస్కట్ల మగడని. అయితే ఈ ముఖంతోటే రోజూ కాలేజీకెళ్ళి వస్తుంటారా!'' అంది విస్తుపోతూ.

''ఏం జెయ్యమంటావు. ఉన్న ముఖం ఇది. లేకపోతే నీకు చిన్నతనం అనిపిస్తే, మద్రాసునుంచి మంచి విగ్ తెప్పించుకుని, పెట్టుకుని కాలేజీకి వెళ్తాను. నీకిష్టమేనా!'' అన్నాడు నేల చూపులు చూస్తూ.

''హు! ఖర్మ! ఖర్మ! అలాగన్నా చేసి...అఘోరించండి. ముసలి మొగుడూ దసరాపండుగా అంటూ నన్ను ఆట పట్టిస్తారు జనం'' అంటూ విసురుగా తన గదిలోనికి వెళ్ళి పోయింది.

రాకేష్ తన అనుమాన నివృత్తికోసం ఎందుకైనా మంచిదని చర్మవ్యాధుల స్పెషలిస్టుని కలిశాడు. జరిగింది చెప్పాడు. గతంలో మీసం మొలవకపోవడం గురించి కూడా ఏకరువు పెట్టాడు. పూర్తిగా చెక్ చేశాకా డాక్టర్ నవ్వుతూనే ''పేనుగొరుగుడు అంటుంటారు తెలుసుకదా. ఆ గొరుగుడిని మీరు నిర్లక్ష్యం చేసిన కారణంగాను, ఇంకా మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే రకరకాల హెయిరాయిల్సు వాడిన కారణంగానూ ఇలా జరిగింది. అయినా ఇప్పుడు జుట్టులేనంత మాత్రాన మీరు దిగులుపడి ప్రయోజనం ఏముంది. ఈ టాబ్లెట్స్ వాడండి. రోజూ ఆ గుండుని అలాగే వదిలేయక చక్కని ప్రశస్తమైన కొబ్బరినూనె రాస్తే మళ్ళీ వెంట్రుకలు మొలిస్తే మొలవచ్చు'' అంటూ తన ఫీజు తాను తీసుకున్నాడు.


ఏడిసినట్టుంది నీ సలహా! ఎరక్కపోయి నీ దగ్గరకొచ్చానురా ...అనుకుని రాకేష్ ఇంటి ముఖం పట్టాడు.

రెండు రోజులు సెలవుపెట్టి చెన్నై వెళ్ళాడు. సినిమా కంపెనీలకు విగ్గులు తయారుచేసే ఎక్స్‌పర్ట్‌ని కలిశాడు. యుద్ధప్రాతిపదిక మీద కొలతలు, డిజైన్ చెప్పి పదివేలిచ్చి విగ్గుతయారు చేయించుకుని దానిని తగిలించుకుని తిరిగి వచ్చాడు.

పద్మజ ఎంతో థ్రిల్ ఫీలైయ్యింది.

మళ్ళీ భర్త బట్టబుర్ర గుర్తుకొచ్చి ''సర్లెండి. ఇది పెట్టుకుంటే కనీసం గుడ్డిలో మెల్లని సరిపెట్టుకోవచ్చును. ఇప్పుడైనా దానిని జాగ్రత్తగా వాడటం నేర్చుకోండి. లేకపోతే మీది గుండు కాదు బట్ట తల అనో, మైదాన మనో, పేను నాకుడు బుర్రనో స్టూడెంట్స్ బిరుదులు ఇస్తారు'' అంటూ హెచ్చరిక చేయడంతో మళ్ళీ ఆలోచనలో పడ్డాడు రాకేష్.

★



## కాకతాళీయం!

షూటింగ్‌లలో తారలు గాయపడ్డం జరుగుతూనే వుంటుంది. అయితే ఒకే సమయంలో ఇద్దరు తారలు గాయపడడం ఇటీవల బాలీవుడ్‌లో విశేషంగా చెప్పుకుంటున్నారు. ముంబాయిలోని ఓ స్టూడియోలో అజయ్ దేవ్‌గన్ నటిస్తున్న సినిమా షూటింగ్ జరుగుతుంటే ప్రక్కనే అదే స్టూడియోలోని మరో సెట్‌లో జూహీ చావ్లా నటిస్తున్న మరో చిత్రం షూటింగ్ జరుగుతోంది. సరిగ్గా ఎవరి షూటింగ్‌లో వారు బిజీగా వుండగా వాళ్ల కాళ్లకి గాయాలు అయ్యాయి. అఫ్‌కోర్స్, జుహీ-అజయ్‌లు నటిస్తున్నవి రెండూ వేర్వేరు చిత్రాలే. కానీ ఒకే చోట ఇద్దరికీ ఒకేసారి ఇలాంటి ప్రమాదాలు కలగడం కాకతాళీయమే! తగిలిన గాయాలు స్వల్పమే అయినా కోయిన్సిడెంట్ పుణ్యమాని పబ్లిసిటీకి నోచుకున్నాయి.

-జె.ఎం.